## బీసీ గురుకులాల్లో వసతులు పెంచాలి



బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆనంద్‌గౌడ్

కాచిగూడ: బీసీ గురుకులాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. బుధవారం బీసీ కమిషన్ చైర్మన్‌నిరంజన్, సభ్యులు రాపోలు జైప్రకాష్, బాలలక్ష్మీలను బీజేపీ ఓబీసీ నేతలు కలిసి బీసీ గురుకులాల్లో వసతులు పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు నందనం దివాకర్, పూజరాజు, ప్యారసాని వెంకటేష్, జక్కలి రాజు, రాజు నేత, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో సమస్యల పై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: వర్షకాలంలో తలెత్తే ఇబ్బందుల పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. బుధవారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ విభాగం అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో రోడ్లు, వర్షపునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే పెండింగ్ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు ఉన్నారు.


## నూకాండ శ్రీలక్ష్మి మరణం వీణా విద్వాంసులకు తీరనిలోటు



(ఫైల్)

నల్లకుంట: రవివర్మ మ్యూజికల్స్ వ్యవస్థాపకుడు, వీణా విద్వాంసుడు నూకాండ రవివర్మ సతీమణి శ్రీలక్ష్మి(68) మరణం వీణా విద్వాంసులకు తీరనిలోటని పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాసశర్మ అన్నారు. వీణల తయారీ, మరమ్మతులు చేయడంలో ఆమెకు ఆమె సాటి అని కొనియాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీలక్ష్మి రెండు రోజుల క్రితం కాచిగూడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. దీంతో నల్లకుంటలోని ఆమె నివాసంలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఆమెకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వీణల తయారీలో ఆమె ఎంతో ప్రావీణురాలు. కాగా 40 ఏళ్లుగా వీణల తయారీ, మరమ్మతులలో భర్తకు చేదోడువాదోడుగా ఉండేవారు. మరణ వార్త తెలుసుకున్న ప్రముఖ క్రికెట్ కోచ్ మల్లాది విష్ణులతో పాటు పలువురు సంగీత, వీణా విద్వాంసులు ఆమె నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతిని తెలియజేశారు. బంధుమిత్రుల అశ్రునయనాల నడుమ బుధవారం సాయంత్రం కాచిగూడలోని హర్రాస్ పెంటలో అంత్యక్రియలు నిర్వహించారు.

## రోడ్డంతా బురదమయం.!



ముషీరాబాద్ సాగ్‌లాల్ ఆస్పత్రి వద్ద వర్షానికి చిత్తడైన రోడ్డు

ముషీరాబాద్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కొన్ని ప్రాంతాలలో రోడ్లన్ని బురదమయంగా మారాయి. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముషీరాబాద్‌లోని సాగర్‌లాల్ ఆస్పత్రి చౌరస్తా నుంచి దాయారం మార్కెట్ వరకు రోడ్డంతా బురదమయంగా మారింది. దీనితో వాహనదారులు, పాదచారులు చిత్తడిగా మారిన రోడ్డుపై నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్డుపై నీళ్లు నిలవడం వల్ల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డును ఆధునీకరించాలని కోరుతున్నారు. పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

## నేడు బ్యాగుల పంపిణీ

ముషీరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా గురువారం ముషీరాబాద్‌లోని గంగపుత్ర కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేయనున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు జైసింహ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

# వ్యాధుల కాలం జర భద్రం

ఫీవర్ ఆస్పత్రి సీఎస్ఆర్ఎంఓ డా. జయలక్ష్మి | వర్షాకాలం వ్యాధులపై 'సాక్షి'తో ఇంటర్వ్యూ



కొన్ని రోజులు నగరాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమైపోతున్నాయి. డ్రైనేజీ, స్ట్రామ్ వాటర్ లైన్‌ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చాలా రోడ్లపై వర్షపు నీరే దర్శనమిస్తోంది. దీనికి తోడు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ కారణంగా బ్యాక్టీరియా, వైరస్‌లు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ కాలంలో వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా డయేరియా, డెంగీ, వైరల్ ఫీవర్స్ వ్యాప్తి చెందుతున్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ జయలక్ష్మి కోరారు. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆమె బుధవారం సాక్షి ఇంటర్వ్యూలో తెలిపారు.

నల్లకుంట

**సాక్షి:** సాధారణంగా వర్షా కాలంలో వచ్చే వ్యాధులేవి ?

**డాక్టర్:** వర్షాకాలంలో విషజ్వరాలు ప్రబలుతాయి. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వ్యాధుల ప్రభావం ఉంటుంది. దోమ, వైరస్, బ్యాక్టీరియాలతో వ్యాధులు సోకే అవకాశం ఉంది. మలేరియా, చికూన్ గన్యా, డెంగీ, స్వైన్ ఫ్లూ, టైఫాయిడ్, మెదడువాపు, డయేరియా, కలరా, డిసెంట్రీ లాంటి వ్యాధులు ఈ కాలంలో ఎక్కువగా ప్రబలుతాయి.

**సాక్షి:** సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి ?

**డాక్టర్:** ఈ సీన్‌లో వచ్చే వ్యాధులన్నీ ప్రాణాంతకాలే. వీటి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పడుకొనేటప్పుడు దోమల ప్రమాదం లేకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలి. తాగు నీటి పాత్రలపై తప్పనిసరిగా మూతలు పెట్టి ఉంచాలి. ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకోవాలి. కాచి చల్లార్చి వడకట్టిన నీటిని తాగాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి.

**సాక్షి:** ఏ ఏ పదార్థాలు తినకూడదు ?

**డాక్టర్:** నిల్వ ఉంచిన మాంసం, చేపలు, ఈగలు వాలిన పదార్థాలు తినకూడదు. ఇవి తింటే వాంతులు, విరోచనాలు అయ్యే ప్రమాదం ఉంది.

**సాక్షి:** ఆహార పదార్థాలు వండినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

**డాక్టర్:** ఆహార పదార్థాలు వండేటప్పుడు, తినేటప్పుడు ముందుగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

**సాక్షి:** పరిసరాలు ఏ విధంగా ఉండాలి ?

**డాక్టర్:** పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చేయాలి. ఖాళీ కొబ్బరి బోండాలు, అట్ట పెట్టెలు, రుబ్బి రోల్లు, పూల కుండీల్లో వర్షపు నీరు లేకుండా చేయాలి. నివాస ప్రాంతాల వద్ద చెత్త ఉంచకూడదు.

**సాక్షి:** నిల్వ నీరు ఉంటే ఏ వ్యాధులు వస్తాయి ?

**డాక్టర్:** నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

**సాక్షి:** ఎవరికైనా వాంతులు, విరోచనాలైనా, విష జ్వరం వచ్చినా ముందస్తుగా ఎవరిని సంప్రదించాలి.?

**డాక్టర్:** ప్రతి బస్తీలోనూ బస్తీ దవాఖానలు అందుబాటులో ఉన్నాయి. అక్కడికి వెళ్లి పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. ఇంకా అవసరమనుకుంటే నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి రావచ్చు. ఇక్కడ 24 గంటలు రోగులకు వైద్యం అందుబాటులో ఉంటుంది. రెండు, మూడు రోజులకు మించి జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. సొంత వైద్యం మంచిది కాదు.

**సాక్షి:** ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి ఆహారం తీసుకోవాలి.?

**డాక్టర్:** ఈ సీజన్‌లో రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి. వీటిలో సీ విటమిన్ ఉన్న పదార్థాలు నిమ్మ, నారింజ, జామ, టమాటాలు, వెల్లుల్లి, పుట్ట గొడుగులు, పెరుగు, అల్లం, మెంతులు, బార్లీతో తయారు చేసిన పదార్థాలను తీసుకోవాలి. ఏ పూటకాపూట ఆహార పదార్థాలు వండుకొని వేడిగా ఉన్నప్పుడే తినాలి. అలాగే ఆహార తయారీ పాత్రలపై మూతలు పెట్టాలి.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



తిలక్‌నగర్ చౌరస్తాలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ తదితరులు

అంబర్‌పేట: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ డీసీపీ సుంకరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కాచిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ఛే నంబరు చౌరస్తా, తిలక్ నగర్ తదితర ప్రాంతాల్లో అడిషనల్ డీసీపీ రాములు, ఏసీపీ శ్రీనివాస్‌లతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలన్నారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇకపై 24గంటలు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనాదారులతో పాటు ట్రక్‌లు, ఆటో వాలాలు సైతం నిబంధన పాటించాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ వ్యతిరేక పార్టీలను భూస్థాపితం చేస్తాం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు బీసీ రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై రాంచందర్‌రావుకు న్యాయపరమైన అంశాలపై అవగాహన లేదన్నారు. పూర్తి అజ్ఞానంతో వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు తొమ్మిదో షెడ్యూల్లో పెట్టడం సాధ్యం కాదనుకున్నప్పుడు అసెంబ్లీలో బీజేపీ శాసన సభ్యులు బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఎందుకు యూటర్న్ తీసుకుంటున్నారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో బీజేపీకి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధ ఎంటో తెలిసిపోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై వ్యతిరేక వైఖరి మార్చుకోకపోతే తెలంగాణలోని బీసీలంతా ఏకమై బీసీ వ్యతిరేక పార్టీలను భూస్థాపితం చేస్తామన్నారు.

## యూనిఫామిక్ ఫెయిర్ ప్రభుత్వమే నిర్ధారించాలి

- క్యాబ్, ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు గాజుల కిరణ్‌కుమార్



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ట్యాక్సీ, ఆటో డ్రైవర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ట్యాక్సీ, ఆటో వాహనాలకు యూనిఫామిక్ ఫెయిర్ (కిలో మీటర్ ధర) ప్రభుత్వమే నిర్ధారణ చేయాలని క్యాబ్, ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షులు గాజుల కిరణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఓలా, ఉబర్, ర్యాపిడో తదితర యాప్ కంపెనీలో పనిచేసే డ్రైవర్ల సంఘం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గాజుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. సోషల్ సెక్యూరిటీ టీమ్‌కు ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచాలన్నారు. అది అంగవైకల్యం, సాధారణ మరణాలకు కూడా వర్తించేలా చూడాలన్నారు. బ్యాచ్ నంబర్, హేవీ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్‌కు లేట్ పెనల్టీ రుసుము లేకుండా అవకాశం కల్పించాలని ఓలా, ఉబర్, ర్యాపిడో కంపెనీల ద్వారా ప్రజా రవాణా చేస్తున్న వాహనాలను నిషేధించాలని కోరారు. ట్యాక్సీ డ్రైవర్లకు ప్రభుత్వమే నూతన యాప్‌ను తీసుకురావాలన్నారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ అబ్దుల్ రావూఫ్, నగేష్‌కుమార్, మోహిద్, తిరుపతి, శివ, సతీష్, బాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'నన్ను సంఘం నుంచి తొలగించే అధికారం ఎవరికీ లేదు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడినైన తనను తొలగించే అధికారం ఎవరికీ లేదని ఆ సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాతంగి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం 2010లో తమ సంఘాన్ని స్థాపించామన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని అనివార్య కారణాల వల్ల 2012లో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్‌ను అధ్యక్షుడిగా నియమించుకున్నామని తెలిపారు. తనపై తమ సంఘంలో పని చేస్తున్న ఏడీఈ బక్క దానయ్యతో కలిసి రెండేళ్లుగా తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

- రాష్ట్ర నాయకత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి పూనుకున్నారని వాపోయారు. అంతేకాకుండా జేఎల్ఎంల వద్ద మెరిట్ కమ్ సీనియర్టీ కోసం కోర్టులో కేసు వేస్తామని చెప్పి ఉద్యోగుల దగ్గర డబ్బులు వసూలు చేసి కేసు వేయలేదన్నారు. ఇవన్నీ గమనించిన రాష్ట్ర నాయకత్వం బక్క దానయ్యను నాలుగు నెలల క్రితం పద్ధతి మార్చుకోవాలని సూచించిందన్నారు. అయినా వినకపోవడంతో జూన్ 11న రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు ఆరేపల్లి మోహన్, బక్క దానయ్యతో పాటు మరికొంత మందిని తొలగించి నూతన కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. అంతేగాని వ్యవస్థాపకుడినైన తమను తొలగించే అధికారం ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు పీఎం రాజు, టీజీఎస్‌పీడీసీఎల్ కంపెనీ నాయకులు ఇమ్మడి జనార్దన్, పుల్లూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లకు సహకరించండి



కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న గుజ్జ కృష్ణ, నందగోపాల్

కాచిగూడ: తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన బీసీ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం పొందే విధంగా సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.నందగోపాల్ కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని ఢిల్లీలో కలిసి వినతి పత్రం అందజేశారు. బీసీలకు చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని వారు కోరారు.

## షమ్రీన్‌కు నగదు పురస్కారం



కాచిగూడ: కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి షమ్రీన్ ఇంటర్ సెకండ్ ఇయర్ బైపీసీ వృక్షశాస్త్రంలో అత్యధిక మార్కులు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డా. చిరంజీవి ఆమె నగదు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ శ్రీనివాసరావు, వి.ప్రసాదరావు, గీత, డాక్టర్ బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను రోడ్లపై కాదు.. రిక్షాల్లో వేయండి

డివిజన్ ప్రజలను కోరిన కార్పొరేటర్ రచనశ్రీ



కవాడిగూడ: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. అందుకోసం ఇళ్ల ముందుకు వచ్చే గార్బేజ్ రిక్షాలలో చెత్తను వేయాలని ప్రజలను కోరారు. బుధవారం దోమలగూడ వార్డు కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన పది గార్బేజ్ రిక్షాలను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జీహెచ్ఎంసీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇళ్లలో ఉన్న చెత్తను ఇష్టారాజ్యంగా రోడ్లపై పడేయకుండా రిక్షాలలో వేయాలన్నారు. ఇందుకోసం జీహెచ్ఎంసీ సిబ్బంది కూడా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత జి.వెంకటేష్, మున్సిపల్ జవాన్ లింగం, సూపర్ వైజర్లు సూర్యప్రకాష్, రాము, కిరణ్, మజర్, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## ఆర్టీసీకి రూ.200కోట్ల ఆదాయం హర్షణీయం



బర్కత్‌పుర డిపోలో కార్మికులతో కలిసి సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు కేపీ మురళీకృష్ణ, దేవిరెడ్డి విజితారెడ్డి

కాచిగూడ: తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా ఆర్టీసీ సంస్థకు రూ.200 కోట్ల ఆదాయం రావడం హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ సీనియర్ నేత కేపీ మురళీకృష్ణ, మహిళా కాంగ్రెస్ నేత దేవిరెడ్డి విజితారెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నేతలు బర్కత్‌పుర ఆర్టీసీ డిపోలో కార్మికులు, సిబ్బందితో కలిసి స్వీట్స్ పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న డిపో అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సిహెచ్ మురళీకృష్ణ, దూదిగామ లింగం, నందు కుమార్, ప్రసాద్, రాజేష్, డిపో అధికారులు అసిస్టెంట్ మేనేజర్ మిథున, రఘునందన్, డిపో కార్మిక నేతలు లక్ష్మణ్, జయలక్ష్మీ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి



జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: నల్లకుంట శంకరమఠం మార్కెట్ రోడ్డుతో పాటు ఇతర కాలనీలు, బస్తీలలో ఛిద్రమైన రోడ్ల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత అన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి ఛిద్రమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఆర్‌వి. కర్ణన్‌ను కలిసిన కార్పొరేటర్ అమృత రోడ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గుంతలమయమైన రోడ్ల కారణంగా వాహనదారులు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్ల మరమ్మతులకు సాధ్యమైనంత తొందరగా నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరామని తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి



పైపులైన్‌పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని, వాటర్‌వార్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, నేతలు

చిక్కడపల్లి: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. టీఆర్టీ క్వార్టర్స్‌లో నిర్మిస్తున్న తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను వాటర్‌వార్క్స్ మేనేజర్ కృష్ణమోహన్‌తో కలసి బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. డివిజన్‌లో ప్రెషర్, కలుషిత నీటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వాటర్‌వర్క్స్ అధికారులే దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్, రఘుయాదవ్, కాంగ్రెస్ నాయకుల శీలం సత్యనారాయణ, వినోద్ బోంస్లే, వాల్లస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఆజామాబాద్ ఫీడర్ పరిధిలోని అచ్యుత్‌రెడ్డి మార్గ్, సీపీఎం ఆఫీస్, రాంనగర్ గుండు, విద్యానగర్ పోస్ట్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు... ఆర్‌టీఎం ఫీడర్ పరిధిలోని ఎంఆర్‌ఓ ఆఫీస్, ఆర్టీసీ కళాభవన్, అచ్చయ్యనగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు... ప్రీవింట్యూ మెడిసిన్ ఫీడర్ పరిధిలోని గౌరమ్మ గల్లీ సాయిబాబా కమాన్, సుందరయ్య పార్కు, హెచ్‌ఆర్‌డీ డీగ్రీ కాలేజ్, రెడ్డి కాలేజ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు... నారాయణగూడ ఫీడర్ పరిధిలోని సూర్యనగర్, నెహ్రూనగర్, మానసా ఎన్‌క్లేవ్, ఆరోర డిగ్రీ కాలేజ్, బాగ్‌లింగంపల్లి, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కవాడిగూడ: ఓ గుర్తుతెలియని 55 సంవత్సరాల వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించారు. ఎస్సై నిరంజన్ తెలిపిన వివరాల ప్రకారం... గిల్కా చౌరస్తాలో గుర్తుతెలియని 50 నుంచి 55 సంవత్సరాల వ్యక్తి మృతదేహం పడి ఉందని సమాచారం వచ్చిందన్నారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు. మృతుడు స్థానికంగా భిక్షాటన చేసేవాడని తెలిపారు. అతడి ఆచూకీ కోసం చుట్టు పక్క ప్రాంతాల్లో విచారించినా ఎలాంటి సమాచారం లభించలేదని పేర్కొన్నారు. అతడి ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో లేదా ఫోన్ నం.8712661524లో సమాచారం అందించాలని కోరారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి వ్యాఖ్యలపై నిరసన జ్వాలలు



క్రాస్‌రోడ్స్‌లో రాంచందర్‌రావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

ముషీరాబాద్: 42 శాతం బీసీ రిజర్వేషన్లకు 'సహకరించమని.. సాధ్యం కాదని'వ్యతిరేకిస్తామన్న బీజేపీ అధ్యక్షుడి వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ నేతృత్వంలో పెద్ద ఎత్తున బీసీ సంఘాల నాయకులు బుధవారం రాంచందర్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ... నాలుగు దశాబ్దాలుగా బీసీ రిజర్వేషన్ల ఉద్యమ ఫలం సాకారమయ్యే దశలో వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీసే అగ్రవర్ణ కుట్రలో భాగమే ఈ వ్యాఖ్యలని అన్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా 80వ దశకంలో వచ్చిన గుజరాత్ రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం నుంచి ఈ రోజు వరకు ఈ వర్గాలే అడ్డుపడుతున్నాయని గుర్తు చేశారు. రాజ్యాంగంలో సోషలిజం స్థాపన కోరకు బలహీన వర్గాలందరిని అభివృద్ధిలోకి తెచ్చే లక్ష్య సాధనగా రిజర్వేషన్ల మార్గం ఎంచుకుంటే అడుగడుగునా ఈ వర్గాలే అడ్డుపడుతున్నాయని తెలిపారు. వ్యవస్థలన్నింటిలో కొత్త కొత్త మార్గదర్శకాలు తయారు చేసి బీసీలను అభివృద్ధికి దూరం చేసే ఈ కుట్రలు ఇక సాగవని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.సుధాకర్ ముదిరాజ్, విజయభాస్కర్, బోయ గోపి, ఇన్‌రావు, పెద్ద ఎత్తున నాయకులు పాల్గొన్నారు.

## 'డబ్బులిస్తేనే రేషన్‌కార్డు మంజూరు చేస్తున్నారు'

ముషీరాబాద్: పౌరసరఫరాల శాఖ సర్కిల్-8 సంబంధించిన ఉన్నతాధికారి మహ్మద్ సమీర్ డబ్బులు తీసుకుని రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నారని బీజేపీ మహంకాళి జిల్లా కార్యదర్శ సభ్యులు బైరు నాగేందర్ ఆరోపించారు. బుధవారం పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు సర్కిల్-8 ఉన్నతాధికారిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కిల్-8 ఉన్నతాధికారి డబ్బులు ఇచ్చిన వారికి మాత్రమే రేషన్‌కార్డులు మంజూరు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి విచారణ జరపకుండా రూ.వేయి నుంచి రూ.8వేల వరకు దరఖాస్తుదారుల నుంచి బలవంతంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. డబ్బులు ఇవ్వలేని పేదల దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని అన్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారితో దురుసుగా మాట్లాడుతూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సమీర్ బావమర్ది మహ్మద్ షానవాజ్ ఆలీ ఫోన్ నంబర్‌కు ఆన్‌లైన్‌లో డబ్బులు తీసుకుంటున్నారని అన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. సర్కిల్-8 పరిధిలో జరుగుతున్న అక్రమాలపై పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇలాంటి అవినీతి అధికారుల వల్ల భోలక్‌పూర్‌లో నివసించే పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రేషన్‌కార్డుల జారీలో అవినీతికి పాల్పడుతున్న సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.